క్లుప్తంగా

చిన్నారుల్లో ఊబకాయం నివారించాలి



ఊబకాయం సమస్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

బొబ్బిలి రూరల్: చిన్న వయసులోనే పిల్లలు ఊబకాయం బారిన పడుతున్నారని.. దీంతో ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని రంగరాయపురంలో శుక్రవారం నిర్వహించిన మహాపోషణ్ కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. ఊబకాయాన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వీలైనంతవరకు జంక్‌ఫుడ్ నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వై.రాజు, రమాకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజన బ్రోచర్ల విడుదల



పీఎం ఆవాస్ యోజన బ్రోచర్లను విడుదల చేస్తున్న చైర్మన్, కమిషనర్, తదితరులు

బొబ్బిలి: పీఎం ఆవాస్ యోజనలో భాగంగా అంగీకార్-2025 బ్రోచర్లను మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనర్ ఎల్. రామలక్ష్మి శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆవాస్ యోజనతో, పీఎం సూర్యఘర్ పథకాల వల్ల కలిగే లాభాలను వివరించారు. కొత్త ఇళ్ల నిర్మాణాలతో పాటు అంగీకార్ ప్రచార కార్యక్రమాన్ని రెండు నెలల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులకు డెల్టా అధ్యక్షుడు మింది విజయమోహనరావు రూపొందించిన ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం వేణుగోపాలరావు చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. స్టడీమెటీరియల్ వల్ల ఇంగ్లిష్ భాషపై పట్టు లభిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా రచయిత విజయమోహనరావును ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే చర్యలు



కాశిందొరవలసలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్: ఎరువులను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.శ్రీను అన్నారు. మండలంలోని కాశిందొరవలస ఆర్‌ఎస్‌కేలో జరుగుతున్న యూరియా పంపిణీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూరియా సరిపడా ఉందని.. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం పట్టణంలోని రవితేజ ఎంటర్‌ప్రైజస్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ రామకుమార్ ఉన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు



పనసలవలసలో గ్రీన్ అంబాసిడర్లకు వైద్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని పనసలవలస, మునకలవలస, కొర్లవలస, తదితర గ్రామాల్లో చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పనసలవలసలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రీణాచౌదరి తనిఖీలు చేపట్టి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వి.జగన్నాథరావు, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ సీహెచ్ పద్మ పాల్గొన్నారు.

వివరాల నమోదుకే గంటల సమయం..

- బాడంగి సీహెచ్‌సీలో తప్పని నిరీక్షణ
- వివరాలు యాప్‌లో నమోదు చేసిన తర్వాతే ఓపీ చీటీ
- ఇబ్బంది పడుతున్న రోగులు



ఆస్పత్రిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగేశ్వరరావు

బాడంగి: వైద్యం కోసం ఆస్పత్రికి వెళితే యాప్‌లో వివరాలు నమోదు చేయాలంటూ గంటల సమయం ఉంచేస్తున్నారు. దీంతో రోగులు అటు వైద్యం అందక.. ఇటు నిరీక్షించలేక ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి శుక్రవారం ఉదయం వైద్య చికిత్సల కోసం పదుల సంఖ్యలో రోగులు వెళ్లారు. అయితే వీరందరి వివరాలు అభ, స్వచ్ఛ నారీ వంటి యాప్‌లలో నమోదు చేయాలంటూ సిబ్బంది రోగులను గంటల తరబడి వెయిట్ చేయించారు. అత్యవసర చికిత్స అందించాల్సిన వారికి కూడా నిరీక్షణ తప్పలేదు. దీంతో రోగులు వైద్యం అందక ఇబ్బంది పడ్డారు.

మంచిదే అయినా..

రోగు వివరాలు యాప్‌లలో నమోదు చేయడం మంచిదే అయినప్పటికీ.. రోగులను గంటల తరబడి నిలిపేయడం సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సిబ్బంది వద్ద ప్రస్తావించగా.. ముందుగా రోగుల వివరాలు యాప్‌లలో నమోదు చేస్తేనే వారికి ఓపీ చీటీ ఇస్తామన్నారు. యాప్‌లో నమోదు చేయడం వల్ల ఎంత మంది రోగులు వస్తున్నారు.. వారికి ఏయే మందులు ఇస్తున్నారో కచ్చితంగా తెలుస్తుందని, అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ విధానం తీసుకువచ్చిందని బదులిచ్చారు. రోగికి అభ యాప్ నంబర్ కేటాయించడం వల్ల భవిష్యత్‌లో ఏ ఆస్పత్రికి వెళ్లినా అతని పూర్తి వివరాలు అక్కడి వైద్య సిబ్బందికి తెలుస్తాయన్నారు. నమోదు అనంతరం వైద్యుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు సేవలందించారు.



యాప్‌లలో నమోదు కోసం ఆస్పత్రి బయట రోగుల నిరీక్షణ

అదనపు సిబ్బంది ఉంటే బాగుండు..

యాప్‌లో నమోదుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రోగులకు త్వరితగతిన సేవలందిస్తే బాగుండునని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ చికిత్స అందించే విషయంలో ఆలస్యం అవుతోందని చెబుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పుష్పాలంకరణలో నవదుర్గ..



రాజాం బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. రాజాంతో పాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకుడు రామాయణం శ్రీనివాసరావుశర్మ ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

- రాజాం సిటీ

అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక చట్టం



తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్న కూలీలు

రాజాం సిటీ: అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వైఎస్సార్ పార్కులో కలాసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హమాలీ, రిక్షా, ఆటో రంగాల్లో ఎంతోమంది కార్మికులు పనిచేస్తున్నారని, వీళ్లకు ఎటువంటి భద్రత లేదన్నారు. ప్రభుత్వం కార్మికులకు ఉపాధితో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో కలాసీల సంఘ నాయకులు చిరంజీవి, రమణ, రాంబాబు, నారాయుడు, పోలినాయుడు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం తగదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానం ద్వారా ప్రైవేటీకరించాలనుకోవడం ఘోరమైన తప్పిదమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలనే నిర్ణయంతో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. నాలుగుసార్లు సీఎం అయిన చంద్రబాబు ఒక్క మెడికల్ కళాశాలనైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. పైగా జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ప్రభుత్వ వైద్యకళాశాలలను నేడు ప్రైవేటీకరించాలనుకోవడం తగదని హితవు పలికారు. వైద్య విద్యను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని చంద్రబాబు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: మున్సిపల్ పరిధిలోని మల్లమ్మపేట విద్యుత్ ఫీడర్ నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఐటీఐ కాలనీ, మిలటరీ కాలనీ, రాజమహల్, మల్లమ్మపేట ప్రాంతాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



నాగభూషణం (ఫైల్)

తెర్లాం: మండల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగభూషణం గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన తొలుత హోంగార్డుగా పనిచేస్తూ 2009లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఈయన స్వగ్రామం బాడంగి మండలం గొల్లాది. కానిస్టేబుల్ మృతిపై సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

పరిసరాలు పరిశుభ్రం

వంగర: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్‌డీ కెల్ల రామారావు అన్నారు. మండల పరిధిలోని శ్రీహరిపురంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తసేకరణ పరిశీలించారు. కాలువల్లో చెత్త వేయరాదని, పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్ ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వంగర: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ తెలిపారు. మండల పరిధిలోని కొట్టిశ గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ ఉత్తరావెల్లి లక్ష్మి, బెవర భాస్కరరావు, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సంతకవిటి: మండలంలోని పోతుల జగ్గుపేట వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మండవకురిటి పంచాయతీ యాలాచిపేటకు చెందిన కొయ్యాన ఎర్రయ్య ఆమదాలవలస మండలం లచ్చయ్యపేట గ్రామంలోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అల్లుడు దాసరి నీలం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా.. సంతకవిటి మండలం పోతులజగ్గుపేట వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడు వీరిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో దాసరి నీలంనకు గాయాలయ్యాయి. ఎర్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయంతో బినామీలకే లాభం



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముప్వల

బొబ్బిలి: ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేటీకరించాలన్న కూటమి నిర్ణయంతో వారి బినామీలకే లాభం చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముప్వల శ్రీనివాసరావు ఆరోపించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు వైద్యవిద్యను దూరం చేస్తూ ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం సమంజసం కాదన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ తరపున పోరాటం తప్పదన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ఖండ్యాంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్యామలాకుమారి

రేగిడి: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్యామలాకుమారి అన్నారు. మండల పరిధిలోని ఖండ్యాం గ్రామంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు, ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగభూషణదొర, సర్పంచ్ ముత్యాలమ్మ, ఎంఎల్‌హెచ్ సుఖీ, ఏఎన్‌ఎం స్వాతి, కార్యదర్శి టి.పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సేవా కేంద్రాలకే అగ్ర తాంబూలం

- ఎస్‌బీఐ ఆర్‌ఎం సాహు



సత్యరావు పట్నాయక్‌కు అవార్డు అందజేస్తున్న ఆర్‌ఎం సాహు

బొబ్బిలి: స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఖాతాదారుల సేవా కేంద్రాలకు అగ్రతాంబూలం ఇస్తున్నట్లు ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ బీబీ సాహు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ వ్యాపార కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల సీఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో ఈ సేవా కేంద్రాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. అతి తక్కువ ప్రీమియంతో యోనో ఈషీల్డ్ పథకం ద్వారా సహజ, ప్రమాద మరణాలకు 40 లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం ఉందన్నారు. ఈ సేవా కేంద్రాల్లో గృహ, వాహన, ఎడ్యుకేషన్, రైతు, ముద్ర, వ్యక్తిగత రుణాలతో పాటు బంగారంపై రుణాలు కూడా ఇస్తారని చెప్పారు. అనంతరం ఉత్తమ సేవలందించిన రామభద్రాపురం సీఎస్పీ సత్యారావుపట్నాయక్ సేవలను కొనియాడుతూ బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ ఈశ్వరరావు, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాజాం సిటీ: మెడికల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కోరారు. ఈ మేరకు స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కరణం హరిబాబుకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రోగులకు సేవలందిస్తున్నా కనీస ఉద్యోగ భద్రతలేదని అన్నారు. అలాగే వేతనాలు కూడా సమయానికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



ఒమ్మి సచివాలయంలో సేవలపై ఆరా తీస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఉద్యోగులకు సూచించారు. మండలంలోని గురవాం, ఒమ్మి, కంచరాం, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సర్వేలపై ఆరా తీయడంతో పాటు సిబ్బంది పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా



రాజాం సిటీ: ఓ ప్రైవేటు దుకాణం వద్ద రైతులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ ఎం.రాజశేఖర్



బాడంగి: గొల్లాది ఆర్‌ఎస్‌కే వద్ద రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వరప్రసాద్

బాడంగి: రైతులందరికీ యూరియా పంపిణీ చేయాలని తహసీల్దార్ కె. వరప్రసాద్ ఆదేశించారు. మండలంలోని గొల్లాది, వాడాడ ఆర్‌ఎస్‌కేల్లో జరుగుతున్న యూరియా పంపిణీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతుల అవసరాలను బట్టి యూరియా పంపిణీ చేయాలన్నారు. రైతులు కూడా మోతాదుకు మించి యూరియా వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సూర్యప్రకాశ్, వీఏఏలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి

రాజాం సిటీ: ఈ ఏడాది ఖరీఫ్‌కు అవసరమైన యూరియా పంపిణీకి రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎం.రాజశేఖర్ కోరారు. పట్టణంలోని పలు దుకాణాల వద్ద సీఐ అశోక్‌కుమార్, ఏడీఏ కె.చంద్రరావు, ఏఓ హరనాథ్‌తో కలసి ఆయన రైతులతో మాట్లాడారు. ఎంజేవలస, డీఆర్‌ఎన్ వలస, అంతకాపల్లి, బొద్దాం, కంచరాం, గడిముడిదాం, కొత్తవలస, సారధి గ్రామాల రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు ఆయా ఆర్‌ఎస్‌కేల ద్వారా టోకెన్లు జారీచేయనున్నామన్నారు. వీరితో పాటు డీటీ ప్రకాష్‌రాజ్ ఉన్నారు.

నానో యూరియా వినియోగంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: నానో యూరియా, డీఏపీ వినియోగంతో పంటలకు మేలని డీడీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని భీమవరంలో రైతులకు ద్రవరూప ఎరువుల వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. అంతకుముందు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ, చప్ప తిరుపతినాయుడు, రైతులు పాల్గొన్నారు.

డిపాజిట్ ఖాతాలతో ప్రయోజనం



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

రేగిడి: బ్యాంకుల్లో డిపాజిట్ ఖాతాలతో ఖాతాదారులకు అదనపు ప్రయోజనం చేకూరుతుందని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆంజనేయులు, మేనేజర్ అశోక్ అన్నారు. మండల పరిధి బూరాడ గ్రామంలో స్వచ్ఛంద సంస్థతో పాటు రాజాం ఎస్‌బీఐ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్‌తో కలసి ప్రజలకు అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్.రాంబాబు, రాజేష్ పాల్గొన్నారు.